క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

కొల్లాపూర్ రూరల్: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ చిన్న ఉస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని కుడికుల్లలో రైతులు వేసిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. వేరుశనగ పంటకు ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు ఎకరానికి హెక్సకోనజోల్ 400 మిల్లీ లీటర్లు స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. పంటల సాగు వివరాలను వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కెట్‌లోనే అమ్మకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గుండాలలో ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం అమావాస్య పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి ప్రత్యేక అలంకరణ చేసి తైలాభిషేకం, అన్నాభిషేకం తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు నరహరి శర్మ, శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, సురేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఉప్పునుంతల: మండలంలోని మీసేవ నిర్వాహకులు ధ్రువపత్రాల కోసం అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మండలంలోని వెల్టూరుకు చెందిన మొగిలి రమేష్‌తో పాటు మరి కొంతమంది శనివారం తహసీల్దార్ ప్రమీలకు ఫిర్యాదు చేశారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకోవడానికి అవసరం లేకున్నా బాండ్ పేపర్ పెట్టాలని అందుకోసం రూ. 400లు వసూళ్లు చేస్తున్నారని వాపోయారు. అక్రమంగా వసూళ్లు చేసిన డబ్బులు తిరిగి దరఖాస్తుదారులకు ఇప్పించాలని కోరారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



బిజినేపల్లి: మండలంలోని పాలెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పది పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి ఏ.రమేష్‌కుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో వైద్య సదుపాయం, తాగునీరు తదితర వాటిని పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. సూపరింటెండెంట్ నరహరికి, ఆంజయ్యలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

26న మహనీయుల జాతర

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో వచ్చే నెల 26న మహనీయుల జాతర నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంతటి నాగన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక బాబు జగ్జీవన్ రామ్ భవనం ఆయన వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. బహుజనులు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, మోహన్‌రెడ్డి, కొత్తపల్లి కుమార్, రాంచందర్, భాస్కర్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీకి సీఎం బాధ్యత వహించాలి

కొల్లాపూర్: పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీకి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు ధార శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కై ప్రభుత్వంలోని కొందరు వ్యక్తులు పేపర్ లీకేజీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. దీనికి సీఎం నైతిక బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు ఆవోపా జిల్లా అధ్యక్షుడు వాస రాఘవేందర్ కుమారుడు వంశీ, కూతురు వందన పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవోపా కొల్లాపూర్ యూనిట్ అధ్యక్షుడు సోమిశెట్టి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఎండ వేడిమికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్లపైనే హైటెన్షన్ తీగలు

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎస్సీ కాలనీలో ఇళ్లపైన 132 కేవీఏ విద్యుత్ లైన్

ఉప్పునుంతల: మండలంలోని పలు గ్రామాల్లో హైటెన్షన్ తీగలు ఇళ్ల పైనుంచి వెళ్లడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పలు కాలనీలలో హైటెన్షన్, 11 కేవీఏ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈదురుగాలులు, ఉరుములు మెరుపుల సమయంలో కాలనీవాసులు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని జంకుతున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో ఎన్నో ఏళ్ల కిందట పాతిన స్తంభాలు శిథిలావస్థకు చేరడం, ఎల్‌టీ లైన్లు కిందకు వేలాడుతున్నాయి. పొలాల్లో రైతులు కర్రలపైనే విద్యుత్ తీగలను అమర్చారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్న ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలపై 11 కేవీఏ లైన్లు

మండల కేంద్రంలోని మడ్డవానిపంపు ఎస్సీ కాలనీలో నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా మారింది. బలమైన గాలులు వచ్చినప్పుడు జంపర్ల వద్ద మంటలు వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. మర్రిపల్లిలో బీసీ కాలనీలో 11 కేవీఏ విద్యుత్ లైన్ ఇళ్లపై నుంచే ఉండటంతో కాలనీ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దాసర్లపల్లిలో ఎన్నో ఏళ్లుగా ఇళ్లపై నుంచి 11 కేవీఏ లైన్ ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో విద్యుత్ వైర్లు తెగిపడి అగ్ని ప్రమాదంకూడా గ్రామంలో చోటుచేసుకున్నా ఇప్పటికీ లైన్ మార్పిడి చేయలేదు. ఉప్పునుంతల ఎస్సీ కాలనీ, తిర్మలాపూర్, తిప్పాపూర్, వెల్టూరు తదితర గ్రామాల్లో గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఇళ్ల పై నుంచి ఉన్నాయి.

చేతికి తగిలే ఎత్తులో..

గుట్టమీది తాండా సమీపంలోని వ్యవసాయ పొలంలో కరెంట్ తీగలు పూర్తిగా కిందకు వేలాడుతున్నాయి. చేయికి తాకె ఎత్తులో తీగలు ఉండటంతో గిరిజన రైతులు లైన్ కింద నుంచి వంగి వెళ్తున్నారు. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ వెళ్లే దారి పక్కన బల్సోని బావి వద్ద రైతులు కొన్నేళ్ల నుంచి రైతులు కర్ర స్తంభాలపైనే విద్యుత్ తీగలు అమర్చుకొని మోటార్లు నడుపుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతి గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో కర్రలపై కరెంట్ లైన్లు దర్శనమిస్తున్నాయి.

ఖర్చులు భరిస్తే లైన్లు మార్పిడీ చేస్తాం

కాలనీలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లు మార్చడానికి శాఖాపరంగా ప్రొవిజన్ లేదు. ఒకవేళ సంబంధిత కాలనీ వాసులు, ఇళ్ల యజమానులు లైన్ మార్పిడికి అయ్యే ఖర్చు భరించగలిగితే మాత్రం అవకాశం ఉన్నచోట ప్రతిపాదనలు తయారుచేసి విద్యుత్ లైన్‌ను మార్పిడి చేసే అవకాశం ఉంది.

– కొండలు, ట్రాన్స్‌కో ఏఈ

అవకతవకలకు పాల్పడొద్దు



గోదాంను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

అచ్చంపేట రూరల్: గోదాంల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని సరైన తూకాల్లో సరఫరా చేయాలని ఆర్డీఓ మాధవి ఆదేశించారు. శనివారం పట్టణంలోని రేషన్‌బియ్య గోదాంను ఆర్డీఓ పరిశీలించారు. బియ్యం బస్తాలను తూకం వేసి చూశారు. రేషన్‌డీలర్లకు సరఫరా చేసే తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ సక్రమంగా ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ బాల్‌రాం, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గార్లపాటి అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిర్సనగండ్ల ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రాస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ సునీత, మిషన్ భగిరథ డిప్యూటీ డీఈ మణిపాల్ వేర్వేరుగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఓ అంజనేయులు, మేనేజర్ నిరంజన్‌కు సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రీతిష్, అర్చకులు లక్ష్మణ్ శర్మ, మురళీధర్ శర్మ, కొందండరామ శర్మ, తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

కల్వకుర్తి టౌన్: విధుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూపరింటెండెంట్ శివరాం హెచ్చరించారు. శనివారం సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో వైద్యులు యశోదాబాయి, పాండురంగ, షకీల్, విజయ్‌కుమార్, ఉదయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

కోడేరు: మండలంలోని తీగలపల్లిలో వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కట్టను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రోడ్డు పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా స్వాధీనం చేసుకున్నారు. ప్రజల రాకపోకల కోసం తాత్కాలికంగా కట్ట ఏర్పాటు చేశారు. దీంతో కట్ట సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయంపై డీఈ సత్యనారాయణగౌడ్‌ను వివరణ కోరగా ఏప్రిల్ 15 నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటమ్మ, రవి, శివశంకర్, వరప్రసాద్, శివయ్య, రాజేష్, రాములు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

వెల్దండ: రేషన్ డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని రేషన్‌దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం స్టాక్ వివరాలను పరిశీలించారు. మండలంలోని 37 రేషన్ షాపులో ఉండగా మార్చి నెలల్లో 62,818 క్వింటాల బియ్యం సరఫరా కాగా 51,521 క్వింటాల బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 11,297 క్వింటాల బ్యాలెన్స్ బియ్యంను తిరిగి ప్రభుత్వానికి డీలర్లు అందించాలని సూచించారు. ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి లబ్ధిదారులకు సన్న బియ్యంను అందిస్తున్నట్లు వివరించారు. దొడ్డుబియ్యం పంపిణీ చేసినట్లు గుర్తిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బియ్యానికి సంబంధించిన వివరాలను సివిల్ సప్లయ్ అధికారులకు నివేదికను అందజేశారు.

9న జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ

బిజినేపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 9న జ్యోతి బాపూలే విగ్రహావిష్కరణ ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ బాలరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. రాజేందర్‌గౌడ్, సత్యశీలాసాగర్, భగవంత్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, అనిల్ గౌడ్, పృథ్వీరాజ్, కిషోర్, అఫ్జల్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలు



పచ్చడి చూపిస్తున్న విద్యార్థులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. తరగతి గదులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ ఉగాది ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, తెలుగువారికి అత్యంత ప్రీతికరమైన పండుగ ఉగాది అని అన్నారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయ పద్ధతుల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వనిత, అధ్యాపకులు రమాదేవి, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టును పరామర్శించిన ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు ఎస్ఎస్ బాబు కుమారుడు యోగివర్మ కొన్నిరోజుల కిందట హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులు, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని శనివారం టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. పలుస విజయ్ గౌడ్, వెంకటస్వామి, కందికొండ మోహన్, కొండకింద మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న శివవర్మ

కొల్లాపూర్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ కోరారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శివవర్మ మాట్లాడుతూ తెలంగాణలోని పలు జిల్లాల్లో తాగు, సాగునీరు అవసరాలు తీర్చేందుకు నిర్మిస్తున్న పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు సమీకరించడంలో విఫలమైందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రాజీవ్ యువవికాసం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సమావేశంలో నాయకులు సలీం, తారాసింగ్, బాలపీరు, రాజు, మధు, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

బైపాస్ బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చారకొండ: జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిలో భాగంగా మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం సత్వరమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు చీర్వేరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బైపాస్ బాధితులు 15 రోజులు రిలే దీక్షలు చేసినప్పుడు ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారుల హామీ ఇవ్వడంతో దీక్ష విరమించినట్లు గుర్తు చేశారు. అధికారులు, నాయకులు స్పందించి వారికి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి అశోక్ గౌడ్, సీపీఐ అచ్చంపేట నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, నాయకులు మద్ది నారాయణ రెడ్డి, జెల్ల బాలయ్య గౌడ్, శంకరయ్య, తిరుమలేష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం: కేసు నమోదు

ఊర్కొండ: ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం కల్వకుర్తి జడ్చర్ల ప్రధాన రహదారిపై సూర్యలత స్పిన్నింగ్ మిల్లు ఎదుట పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. సమీపంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన రతి రంజన్ అనుమానాస్పందంగా కనిపించాడు. దీంతో పోలీసులు పట్టుకొని అతని వద్ద 20 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో శనివారం అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

సంత వేలం రూ. 37.5 లక్షలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం పశువులు, మేకలు, గొర్రెల సంత వేలం పాటను నిర్వహించారు. మొత్తం 7 మంది టెండర్ వేశారు. కనకటి ఆంజనేయులు రూ. 37.5 లక్షలకు దక్కించుకున్నారు. ఈనెల 19న నిర్వహించిన వేలం పాటలో 6 మంది టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో శనివారం మరోసారి వేలం పాట నిర్వహించారు. అదనంగా ఒకరు టెండర్ వేయగా 7 మందితో వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలం గౌతంపల్లి గ్రామానికి చెందిన మనీషా అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలో ఓ ఆస్పత్రికి పొందుతోంది. ఈ నెల 27న టీ తాగేందుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



కల్వకుర్తిరూరల్: రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా నిధులు జమ కాక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, పరశురాములు, బాల్‌రెడ్డి, కిశోర్, చెన్నయ్య, కృష్ణారెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టాన్ని పరిశీలించిన ఎస్పీ

కల్వకుర్తి టౌన్: దోమలపెంట వద్ద కారులో ప్రయాణిస్తున్న మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ సుధాకర్ పటేల్ (50), కిషన్‌రావు (60)లు వెల్దండ మండలంలోని యెన్నమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. పోస్టుమార్టంను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ పరిశీలించారు. అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఊర్కొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. శనివారం తెల్లవారుజామున నర్సంపల్లి గ్రామం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్న స్టేషన్‌కు తరలించారని వివరించారు. జడ్చర్ల మండలంలోని అల్వాల్ పల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తునట్లు గుర్తించారు. రాజాపూర్ మండలం చెందిన కొత్త చెన్నయ్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు నిరంజన్‌కు సంబంధించిన పాడిగేగె మేత మేసేందుకు వ్యవసాయ పొలంలోకి వెళ్లింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రూబీ గార్డెన్‌లో ముస్లింలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదు ఇమాంలకు రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చారకొండ: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ నిలుస్తాయని మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్ అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని మండలం కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పార్థనలు చేశారు. నజిరుద్దీన్, బురాన్, షబ్బీర్, ఇస్మాయిల్, గౌస్, ఆరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాంగౌడ్, నాయకులు మహేందర్, అంజయ్య, వెంకటయ్య గౌడ్, శివ, నాగేందర్, నాగర్జున తదితరులు ఉన్నారు.

కరపత్రం విడుదల

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో 5న నిర్వహించే చింతలపల్లి నిర్మలాదేవి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం సీఎస్ఆర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు సి భాస్కరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురస్కారాన్ని ఆదివాసి హక్కుల పోరాట యోధుడు ఇల్లెందు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు గుమ్మడి నరసయ్యకు అందజేయనునట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, ఎదిరెపల్లి కాశన్న, ముచ్చర్ల దినకర్, కల్వకోలు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

